
# సంక్రాంతి సస్పెన్స్ !?!

– కంఠ్లకుంట శరత్‌చంద్ర



సమయం రాత్రి పదకొండయ్యింది. ఆనందరావు, మంచంపై కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఓసారి భార్య వంక చూసాడు. ఆమె, ఏ టెన్షనూ లేనట్లు హాయిగా నిద్రపోతోంది. అతడు తన చూపును మరల్చి సీలింగ్‌ఫ్యాన్ వంక చూసాడు. చలికాలం కాబట్టి ఫ్యాన్ ఆఫ్ చేసుంది. అతని ఆలోచనలు ఒకదానితో ఒకటి ఢీకొంటున్నాయి.

సం...క్రాం...తి!

సమ్...క్రాంతి!! మిగతా...సమ్ (some) చీకటి. ఒకప్పుడు సంక్రాంతిలక్ష్మిని ఆహ్వానిస్తూ పాటలు పాడుకునే జనం... ఇప్పుడు...దరిద్రదేవతను... తిట్టే ఓపిక కూడా లేక కాళ్ళు డొక్కలో పెట్టుకుని ముడుచుకు పడివున్నారు.

ఆనందరావు ఆలోచనల్ని తరుముతూ... పెరట్లో ఏదో శబ్దం వినిపించింది. అతడు వడివడిగా లేచి, టార్చ్‌లైట్ తీసుకుని, పడమటి తలుపు తెరిచి పెరట్లోకి వెళ్ళాడు. పెరట్లో గుబురుగుబురుగా పెరిగున్నాయి రకరకాల చెట్లు. టార్చ్‌లైటు వేసి, ఇంటిచుట్టూ కలియదిరిగాడు.

ఎవరూ అగుపించలేదు.

నెమ్మదిగా ఇంట్లోకి నడిచి, పెరటితలుపు గడియవేసి, హాల్లోకి వచ్చి కూర్చున్నాడు. అతని మొహంలో విచారం... నృత్యం చేస్తోంది.

ఈలోకంలో లేనట్లుగా ఏదో ఆలోచిస్తూ... లేచి, పదిసార్లు అటు ఇటూ పచార్లు చేసాడు. ఆ తర్వాత, మొహానికి పట్టిన చెమటను

తుడుచుకున్నాడు. చలికాలంలో చెమట పట్టిందంటే అతడెంత దీర్ఘాలోచనలో మునిగున్నాడో అర్థం చేసుకోవచ్చు. గబగబా పుస్తకాల అల్మైరావైపు నడిచి, ప్యాడ్‌కు కాగితం బిగించి, హాలుమధ్యలో కుర్చీ వేసుకుని, రాయసాగాడు.

"సుశీలా! నీకు తెలియనిదేముంది చెప్పు. ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు చేసేసరికి ఉన్నదంతా ఊడ్చుకుపోయింది. ఇద్దరు కొడుకుల్ని పేమెంట్ సీట్స్‌తో ఇంజనీరింగ్ చదివించేసరికి అప్పులు పెరిగాయి.

చిన్న కంపెనీలో ఉద్యోగం చేసి రిటైరయిన నేను ఆ అప్పులు తీర్చే స్థితిలో లేను. మన అబ్బాయిలిద్దరూ భార్యాదాసులై మన గురించి మన ఆర్థికస్థితి గురించి ఆలోచించడం మానేసారు. అల్లుళ్ళు ఈ సంక్రాంతికి చెరో లక్షరూపాయలివ్వమని ఫోన్ చేశారు. ఆ విషయం నీకు చెప్తే బాధపడతావని చెప్పలేదు. వారం రోజుల్లో సంక్రాంతి వచ్చేస్తోంది. అల్లుళ్ళు వచ్చేస్తారు. డబ్బులివ్వకపోతే మన అమ్మాయిలిద్దరినీ ఇక్కడే వదిలేసి వెళ్ళిపోతామని కూడా చెప్పారు.

సుశీలా...! మనకున్న ఒకే ఒక ఆధారం మా నాన్నగారు ఇచ్చిన ఈ ఇల్లు. బ్రతికున్నంత వరకూ... ఈ ఇల్లు అమ్మకూడదనుకున్నాను. కానీ ఇప్పుడు అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది. నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను. ఈ ఇంటిని అమ్మేసి మన అప్పులు తీర్చెయ్యి. అల్లుళ్ళకు చెరో లక్ష ఇచ్చేసి నువ్వు ఏదైనా వృద్ధాశ్రమంలో చేరు. జీవితాంతం నీకు తోడుగా వుంటానని ప్రమాణం చేసిన నేను మధ్యలోనే నిన్నువదిలి ఈ లోకాన్ని వదిలి, వెళ్లిపోతున్నందుకు నన్ను క్షమిస్తావు కదూ...! రైలు వచ్చే టైమైంది. వెళ్తున్నాను.

ఇట్లు
పిరికివాడైన నీ భర్త.

రాసేసి, కుర్చీలో పెట్టి ముందుతలుపు తెరిచి, బయటకు వెళ్ళి, గడియవేసి రైలు పట్టాల వైపు నడక సాగించాడు. అప్పటిదాకా బీరువా వెనక దాగున్న దొంగ మెల్లిగా హాలు మధ్యలోనికి వచ్చాడు. కుర్చీలో వున్న ప్యాడ్‌ను చేతిలోనికి తీసుకుని గబగబా అది చదివేశాడు.

ఎంత దొంగైనా... అతనూ మనిషేగా!

"అంటే... ఈ పెద్దాయన ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్ళాడా!" అనుకుని, ఆప్యాడ్‌ను కుర్చీలో పడేసి, పెరటితలుపు తెరిచి, గోడదూకి రైలు పట్టాలవైపు పరుగెత్తాడు. " ఈపెద్దాయన రైలుపెట్టాలపై కుడివైపు వెళ్ళాడా! ఎడమవైపు వెళ్ళాడా! ఏమో...! త్వరగా వెతికి పట్టుకోవాలి." అనుకుంటూ ఓ పావుగంట సేపు, కుడివైపు వెతికాడు. ఎక్కడా కనిపించకపోయేసరికి ఆయాసపడుతూ ఎడమవైపు పరుగెత్తాడు.

"ఆ పెద్దాయన ఎక్కడా కనిపించడే!"

దొంగ, చెమటలతో తడిసిపోతున్నాడు. పరుగెత్తి, పరుగెత్తి కళ్ళుతిరుగుతున్నాయి. దూరంగా రైలు కూత వినిపించింది. అతడు మరింత ముందుకు పరుగెత్తాడు. ఆనందరావు ఓ చెట్టు క్రింద అగుపించాడు. రైలు కూత వినిపించడంతో లేచి నిలబడ్డాడు. దొంగ పరుగెత్తుకొచ్చి ఆనందరావును గట్టిగా పట్టుకున్నాడు.

"ఏయ్ ఎవరు నువ్వు? వదులు..." అన్నాడు ఆనందరావు, విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ.

ఆయాసపడుతూనే ఆ దొంగ, ఆనందరావును మరింత గట్టిగా పట్టుకున్నాడు.

"సార్...! కష్టాలుంటే మాత్రం చావాలనుకుంటారా! ఎంత ఘోరమైన పనిసార్... ఈ ఆత్మహత్య! వద్దుసార్...వద్దు" అన్నాడు దొంగ.

ఆనందరావు మరింతగా గింజుకోసాగాడు.

"ఎందుకుసార్ వదిలించుకోవాలని ప్రయత్నిస్తారు. రైలు వెళ్ళేదాకా మిమ్మల్ని వదలను. అల్లుళ్ళు డబ్బులడిగారని ఆత్మహత్య చేసుకుంటారా! నన్ను చూడండి ఎవడి ఇల్లలోనా సరే దోచి మరీ బతుకుతున్నాను. అంతేగానీ చచ్చిపోవాలనుకున్నానా! వద్దుసార్! ఆత్మహత్య మహాపాపం సార్...! వద్దుసార్...!"అన్నాడు.

"ఏయ్...! ఎవర్నువ్వు? నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు. పిచ్చిగానీ పట్టిందా? వదులు" అరిచాడు

ఆనందరావు. "అమ్మా, నేను వదిలితే నానుండి తప్పించుకుని వెళ్ళి రైలు క్రింద పడదామనే! నేను చస్తే వదలను. నాకళ్ల ముందే నిండు ప్రాణం పోతుంటే చూస్తూ ఊరుకుంటానా! వదలను" అన్నాడు వాడు.

రైలు వెళ్ళిపోయింది.

దొంగ, ఆనందరావును వదిలివేశాడు.

"ఇప్పుడు చెప్పు. సంగతేంటసలు?" అన్నాడు ఆనందరావు. "సార్ మీరు, మీ పెరట్లో వచ్చిన శబ్దం విని వెనక తలుపు తెరిచి ఇంటిచుట్టూ వెతికారు. ఆటైంలో నేను, దొంగతనం చేద్దామని మీ ఇంట్లో దూరాను. మీరు, ఆత్మహత్య చేసుకుంటానని ఉత్తరం రాసిపెట్టి ఇలా వచ్చారు. నేను, ఆ ఉత్తరం చదివి, మిమ్మల్ని రక్షిద్దామని ఇలా పరుగెత్తుకొచ్చాను. ఇల్లు రైలు పట్టాలకు దగ్గరగా వుంటే అన్నీ ఇలాంటి ఆలోచనలే వస్తాయి సార్. వద్దుసార్ ఆత్మహత్య మహాపాపం అన్నాడు దొంగ" నిజాయితీగా.

ఆనందరావు పడిపడి నవ్వుకున్నాడు.

"ఏంట్సార్... అలా నవ్వుతారు?" అన్నాడు దొంగ ఆశ్చర్యంగా, "ఓరి దద్దమ్మా...! నేను రచయితను. 'పత్రిక' అనే మాస పత్రికకు ఓ కథ రాయబోతున్నాను. అక్కడ రాసి పెట్టింది... అదే! ఆలోచనల కోసం ఇలా రైలు పట్టాలవైపు నడిచొస్తుంటాను, అప్పుడప్పుడు" చెప్పాడు ఆనందరావు.


దొంగ బిత్తరబోతూ..."మరి...ఆ... కథ రాస్తున్నప్పుడు మీ మొహం విచారంగా ఎందుకుంది?" అన్నాడు.

"ఏ రచయితైనా తన గుండెను చీల్చుకు వచ్చే భావాలను రాస్తున్నప్పుడు ఆ కథ లోని పాత్రలలో లీనమై పోవడం అప్పుడప్పుడూ జరుగుతుంది" చెప్పాడు ఆనందరావు.

దొంగ, ఆనందరావు వైపు వింతగా చూశాడు. ❑

---

# ప్రార్థన



అమ్మా... నీకు దండం!
నన్ను ప్రసవించకు
తల్లీ! నీకు మొక్కుతాను
నాకు జన్మనీయకు
నవమాసాలూ నిండాయని
ఈ మట్టిపై పడేయకు
నెత్తురంటిన నీ పేగునే
ఈ మట్టి అంటకుండానే
పసిగుడ్డుగా చిదిమిపోనీ...
అమ్మా... నీకు దండం
నన్ను ప్రసవించకు
నన్ను ప్రసవిస్తే...!
ఈ మట్టిపై పడగానే
నాకు మతం పుట్టుమచ్చ పుడుతుంది
ఈ నేల ధూళిని తాకగానే...
కులం పచ్చబొట్టు పొడుస్తారు
నీ కడుపు నుంచి బయటపడి
ఏ సబర్మతికో... సజీవ బూడిద కాలేను
తల్లీ నీకు దండం
నన్ను ఎర్రబస్సు అగ్నికీలలకు
నిర్దయగా ఆహుతి చేయకు
మతం తెలియని జీవిగా
కులం గోడులేని పసిగుడ్డుగా
ప్రశాంతంగా నీ కడుపున
నా కథ ముగియనీ...
అమ్మా... నీకు దండం
ఆ... ఒక్క మేలు చేయి తల్లీ!

– పండా నాగేంద్ర త్రినాథ్.